# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

శనివారం, 7 జూన్, 2025


## బిల్ కలెక్టర్ కుటుంబానికి ఆర్థిక చేయూత



**జమ్మికుంట, జూన్ 6 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట గ్రామానికి చెందిన పూలాల కుమారస్వామి మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఇటీవల కాలంలో మృతి చెందాడు. కుమారస్వామి మిత్రులు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అతని బ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తిని సదయ్య గౌడ్,విజయ్ గౌడ్, పంజాలశ్రీను, రాజు, సారయ్య గౌడ్, రచ్చ గణేష్, సుమన్ , రమేష్ ,అనిల్, రవీందర్, శ్రీను, శ్రీనివాసరావు, వెంగళరావు ,రవీందర్, బుచ్చన్న, కొండపాక సమ్మయ్య, శ్యామ్, రంజిత్ రాజురావు తో పాటు తదితరులు ఉన్నారు.

## గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**మంథని 6 (నినాదం న్యూస్):** మంథని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో మంథని బాలికలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ టి. శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీలో 10, ఎంపీసీలో 20 సీట్లు ఖాళీలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు 16 వ తేదీ వరకు సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం ఇంచార్జ్ ప్రిన్సిపల్ 96522 67502 ను సంప్రదించాలన్నారు.

## జీవనోపాధి దొరకకపోవడంతో యువకుడి ఆత్మహత్య

**జమ్మికుంట, జూన్ 6 (నినాదం న్యూస్) :** జీవనోపాధి కోసం పక్క రాష్ట్రం నుండి వచ్చి ఉపాధి దొరకకపోవడంతో మనస్థాపం చెంది ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రంలోని పాట్నా జిల్లా రసూల్పుర గ్రామానికి చెందిన కామేశ్వర్ కుమార్(20) అనే యువకుడు ఉపాధి కోసం జమ్మికుంట పట్టణానికి వచ్చాడు. గత కొద్ది రోజులుగా పని దొరకకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో తీవ్ర మనస్థాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు. సమీప బంధువులు అరుణ్ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**మల్హర్ జూన్ 6 (నినాదం న్యూస్) :** మల్హర్ మండల కేంద్రంలో మల్లారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేనవేన లక్ష్మీమల్లు తల్లి ఇటీవలే అనారోగ్యం కారణంతో మృతి చెందడం జరిగింది, కావున రాష్ట్ర ఐటీ, పరిశ్ర మలు మరియు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఈరోజు మల్లారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పి వారికి ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగన్నపేట మురళి, భూక్య రాజునాయక్, నేరేడుగొమ్మ రాజేశ్వర్ రావు,రెవెల్లి లింగయ్య,మేకల రాజయ్య, లింగన్నపేట రమేష్, ముంజం శంకర్, కన్నెవేన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మక్క ఎల్లమ్మకు నివాళులు అర్పించిన పలువురు నాయకులు



**నర్సంపేట, జూన్ 6 (నినాదం):** ఖానాపురం మండలం మంగళవారిపేట గ్రామానికి చెందిన మక్క పెద్ద వెంకన్న తల్లి ఎల్లమ్మ అనారోగ్యంతోశుక్రవారం మృతి చెందడం జరిగింది.విషయం తెలుసుకుని ఎల్లమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళ్లులు అర్పించి, వారి కుటుంబసభ్యులను భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా౹౹ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమలో భారతీయ జనతా పార్టీ ఖానాపురం మండల నాయకులు లోకసాని రజనీకాంత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కలకోటి సహదేవ్, నార్లపురం పాపయ్య, ఎర్ర కళ్యాణి, ఖలీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కొంకిస విఘ్నేష్, జూలూరి మనీష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## కంపు కొడుతున్న... బస్టాండ్ ఆవరణం...

### పందులు సంచారంతో కూడా పరేషాన్ అవుతున్న ప్రయాణికులు



**కోదాడ, జూన్ 6 (నినాదం న్యూస్) :** వందలాది మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు కొనసాగించే కోదాడ బస్టాండ్ ఆవరణం అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతుంది. ఆవరణంలో నీరు నిల్వ ఉండి దోమలు చేరి దు ర్గంధం వెదజల్లుతుంది. దీంతో ప్రయాణికులు ముక్కు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షపు నీరుతో పాటు, బస్టాండ్ వెలుపల వైపు నుండి వస్తున్న నీరు చేరి చిన్నపాటి చెరువును తలపిస్తుంది. అంతేకాకుండా బస్టాండ్ ఆవరణంలో పందులు సంచరించుతూ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నిల్వ ఉన్న నీటిని తొలగించాల ని ప్రయాణికులు కోరుతున్నారు.

## ఆరోగ్య పరీక్షలు, వెరిఫికేషన్ సర్టిఫికెట్ల పంపిణీ



**కరీంనగర్, జూన్ 6 (నినాదం న్యూస్) :** బక్రీద్ పండుగను పురస్కరించుకొని కరీంనగర్ రూరల్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శుక్రవారం రోజున బొమ్మకల్ ప్రాంతంలోని రజ్వీ చమాన్, విజయనగర్ కాలనీలలో ఉన్న పశువధశాలలకు ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్లను తీసుకొని వెళ్లి, సుమారు 100 పశువులను ఆరోగ్య పరీక్షలు చేయించారు. పరీక్షల అనంతరం, పశువుల ఆరోగ్యం, వయస్సు, ఇతర ఆరోగ్య పరిస్థితుల ను బట్టి వధకు అనుమతి ఉన్న వాటికి సంబంధించిన యజమానులకు వెరిఫికేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా, ముస్లిం మత పెద్దలతో పశువధలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనల గురించి క్లుప్తంగా వివరించారు. పశు వులను వధించాలంటే తప్పనిసరిగా పశువధశాలల్లోనే వధించాలని వారిని కోరారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్లు, పోలీస్ సిబ్బంది, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. కరీంనగర్ రూరల్ పోలీస్ పక్షాన పాల్గొన్న వారందరికీ ముందుగా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి ఆకాంక్షిచారు.

# ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన బిజగిరి షరీఫ్ దర్గా..

**సర్వమతాల సమ్మేళనానికి ప్రతీకగా నిలిచిన హ్రజత్ సయ్యద్ ఇంకుషావళి దర్గా**

**మత సామరస్యానికి ప్రతీక వైషమ్యాలకు చరమ గీతిక**

**వేలాదిగా తరలిరానున్న హ్రజత్ సయ్యద్ ఇంకుషావళి భక్తులు**



**జమ్మికుంట, జూన్ 6 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలం బిజిగిర్ షరీఫ్ గ్రామంలోని ప్రముఖ ముస్లిం పుణ్యక్షేత్రం హ్రజత్ సయ్యద్ ఇంకుషావళి రహ్మతుల్లాహు అలై దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. వందల ఏళ్ళ నుండి కులమతాలకతీతంగా సర్వమతాలకు వేదికగా కుల,మత,వర్గ, సామాజిక వైషమ్యాలకు అతీతంగా జరిగే ఉర్సు ఉత్సవాలకు వేదికగా నిలుస్తుంది. బిజిగిర్ షరీఫ్ ఉర్సు ఉత్సవాలు బక్రీద్ పండుగ తేది: 07-06-2025 నుండి 09-06-2025 వరకు కొనసాగే ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు హ్రజత్ సయ్యద్ ఇంకుషావళి దర్గాను దర్శించుకుంటారు. తమ కష్టాలు తొలగిపోవాలని కోరికలు నెరవేరాలని వేడుకుంటారు. వివిధ జిల్లాల నుండే కాక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుండి కూడా భక్తులు ఉర్సు ఉత్సవాలకు హాజరవుతారు.

### ఉర్సు ఉత్సవాలు

ఉర్సు ఉత్సవాల సందర్భంగా 7వ తేదీ శనివారం బక్రీద్ పండుగ రోజున సాయంత్రం గుసల్ షరీఫ్ కార్యక్రమం నిర్వహిస్తారు. దర్గా ముతావలి మహ్మద్. అక్బర్ అలీ దర్గా కమిటి అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో జరిగే చాదర్ గుల్ కార్యక్రమంలో దర్గా ముజావర్లు హైద్రబాద్ నుండి తెచ్చిన చాదర్లు శనివారం తేది 07 సాయంత్రం ప్రత్యేకంగా దర్గాలోని సమాధులకు ఆలంకరించనున్నారు. శనివారం రాత్రి కొత్తగూడెం వాస్తవ్యులైన శ్రీ కీ౹౹శే.గాజి గోవర్ధన్ మిత్రబృందం సుమారు మూడువేల మంది భక్తులకు అన్నదానం చేయనున్నారు. శనివారం బక్రీద్ పర్వదినం రాత్రి ముఖ్య ఘట్టమైన సంధల్ షరీష్ (గంధ లేవనం)ను మొళ్ళపల్లె పెద్ద బిజిగిర్ షరీఫ్ గ్రామాల నుండి ఉత్సాహపూరిత వాతావరణంలో భక్తుల మేళతాళాల మధ్య సంధల్ ను ఊరేగింపుగా దర్గాకు తీసుకొవచ్చి భక్తిశ్రద్ధలతో సమాధులకు అలరింపజేస్తారు. ఉర్సు సందర్భంగా మహ్మద్ ప్రవక్త ఉపదేశాలను అలపిస్తూ ఖవ్వాలి సమ్మేళనాలు జరుపుతారు. ఈ ఖవ్వాలి కార్యక్రమంలో మహారాష్ట్ర లోని లాతూర్‌కు చెందిన ప్రముఖ ఖవ్వాలి పార్టీ నాందేడ్ కు చెందిన మహ్మద్ సలీమ్ పాషా బృందం ఖవ్వాలి లు అలపించనున్నారు.

### భక్తుల నమ్మకం

ప్రజల భక్తి విశ్వాసాలకు చారిత్రాక చిహ్నంగా నిలిచిన ఈ దర్గా పై భక్తులకు ఎనలేని విశ్వాసం ఉంది. దర్గాలో జరిగే ఉర్సు ఉత్సవాలకు హిందు, ముస్లిం, సిక్కు తదితర అన్ని మతాల భక్తులు హాజరవుతుంటారు. దర్గాషరీఫ్ మన దేశంలోని మత సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తోంది. అనేక రుగ్మతలు దీర్ఘకాలిక రోగాలు, మానసిక రోగాలు నయం కావాలని ఇక్కడ వేడుకుంటారు. ఆరోగ్యం కుదట పడిన తర్వాత "కందుర్లు" పేరిట తమ మొక్కులు తీర్చుకొంటారు. కొత్తగూడెంకు చెందిన భక్తుడు గాజి గోవర్ధన్ మిత్రబృందం 18 సంవత్సరాల నుండి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

### ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు


దర్గా ఉర్సు ఉత్సవాలు జరుపుటకు దర్గా ముతవల్లి కమిటీ దర్గాను, మినార్లు, చారిత్రాత్మక కట్టడాలకు రంగులు వేయించారు. దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు త్రాగునీరు, వైద్యం, పోలీస్ బందోబస్తు, విద్యుత్ సౌకర్యం, జనరేటర్,వసతి, బస్సు సౌకర్యం విస్తృతంగా ఏర్పాట్లను చేస్తున్నట్టు దర్గా ముతవల్లి మహమ్మద్ అక్బర్ అలీ, దర్గా ముతవల్లి కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్‌బీదర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫిక్ హుస్సేన్, దర్గా కమిటీ కార్యదర్శి మహమ్మద్ జమాల్ అష్రఫ్,దర్గా కమిటీ సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయిము ద్దీన్, షా హుస్సేన్ సభ్యులు అహ్మద్,లతీఫ్ హుస్సేన్, ఆజమ్, జలీల్,తాజ్ తదితరులు పాల్గొన్నారు.

### దర్గా ప్రాశస్త్యం....



తెలంగాణాలోనే అత్యంత ప్రముఖ పుణ్యక్షేత్రం బిజిగిరిషరీఫ్ దర్గాను 11వ శతాబ్దంలో నిర్మించినారు.సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ దర్గాలో హ్రజత్ సయ్యద్ ఇంకుషావళి రహ్మతుల్లాహు ఆలైతో పాటు ఆయన సోదరుడైన హ్రజత్ సయ్యద్ అజ్మత్ షావలీ వీరి కుమారులైన హ్రజత్ సయ్యద్ ముర్తుజాషావళి, హ్రజత్ సయ్యద్ అక్బర్ షావలి సమాధులున్నాయి. జమ్మికుంట పట్టణానికి తొమ్మిది కిలోమీటర్లు దూరంలో విశాలమైన గుట్టలు, ప్రకృతి రమణీయత ఆహ్లాదకరమైన వాతావరణానికి అనుసంధానమై చారిత్రక ఆధ్యాత్మిక ప్రాశస్త్యం గల ఈ దర్గా ఉంది. ఇస్లాం తో పాటు అల్లాహ్ సందేశాన్ని దివ్య ఖురాన్ లోనీ సూక్తులను ప్రజలకు తెలియజేస్తు మధ్యయుగాల కాలంలో అరబ్బు దేశం నుండి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ మానవత్వమే మతం అని విశ్వమానవ సమానత్వాన్ని చాటుతు బిజిగిర్ షరీఫ్ చేరుకొని దర్గాను నిర్మించుకున్న హ్రజత్ సయ్యద్ ఇంకుషావళి తన జీవిత కాలంలో ప్రదర్శించిన మహిమలు, బాధితుల పట్ల చూపిన కరుణ దయ వల్ల ఎందరో ప్రజలు సుఖ శాంతులలో జీవనం గడుపగలినారు. హ్రజత్ సయ్యద్ ఇంకుషావలి వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా జిల్ హజ్ మాసంలో 10వ తేది: 07-06-2025 నుండి మూడు రోజుల పాటు ఉర్సు ఉత్సవాలు జరుగుతాయి. నిష్టలతో వేడుకునే భక్తుల కోరికలను హ్రజత్ సయ్యద్ ఇంకుషావళి తీర్చుతారని ప్రసిద్ధి.

### ఉర్సు ఉత్సవాలకు హాజరుకానున్న ప్రజాప్రతినిధులు..



దర్గా ఉర్సు ఉత్సవాల కార్యక్రమానికి ఆదివారం రోజున ఉదయం తెలంగాణ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి,హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ శ్రీమతి పుల్లూరి స్వప్న-సదానందం, జమ్మికుంట తహసిల్దార్ ఎన్ వెంకట్ రెడ్డి , బిజిగిర్ షరీఫ్ గ్రామ కార్యదర్శి ఇంగ్లే రాజు తదితరులు దర్గాలోని సమాధులకు చాదర్లు సమర్పించి ఉత్సవాలలో పాల్గొనున్నారు. ఉర్సు ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు హుజురాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట సిఐ ఎస్ రామకృష్ణ గౌడ్, సబ్ ఇన్స్పెక్టర్ శేఖర్ రెడ్డి పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

## నాణ్యత ప్రమాణాలు పక్కగా అమలు చేస్తున్నాం

**ఆసుపత్రి కిచెన్ రూం తనిఖీ.. రోగులకు అందించే ఆహారం పరిశీలన**

**ఆర్ఎంవోతో కలిసి వంటగదిలోనే భోజనం చేసిన సూపరింటెండెంట్**



**వనపర్తి ప్రతినిధి, జూన్ 6(నినాదం న్యూస్) :** ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో డైట్ ప్రకారం పక్కాగా అమలు చేస్తున్నామని వనపర్తి జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు అన్నారు. శుక్రవారం జిల్లా జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లోని వంట గదులను ఆర్ఎంఓ డాక్టర్ శివప్రసాద్ తో కలిసి తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, వంట గదిలోనే వండిన ఆహారాన్ని భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాదులోని ఎర్రగడ్డ ఆసుపత్రిలో ఫుడ్ పాయిజన్ జరిగిందని, దీంతో అన్ని ఆసుపత్రిలో కూడా అలాగే జరుగుతుందనుకోవడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో గతం కంటే ఎంతో మెరుగైన ఫలితాలు సాధిస్తూ రోగులకు నాణ్యవంతమైన భోజనం అందిస్తున్నామని, మెనూ ప్రకారమే డైటీషియన్ ఆమోదంతో భోజనం అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు వైద్యులు భోజనం చేసిన తర్వాతే రోగులకు వడ్డించడం జరుగుతుందని, వంటగదిలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడం, క్వాలిటీ రైస్ వాడటం, తాజా కూరగాయలనే వాడటం, ప్రతి రోగికి గుడ్డు, అరటిపండు అందించడం కూడా జరుగుతుందన్నారు. డయాబెటిక్ రోగులకు చపాతీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మెఘారెడ్డి నిత్యం ఆసుపత్రి పై పర్యవేక్షిస్తూనే ఉన్నారని, ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్త కథనాలు ప్రచారం చేయడం వల్ల సమాజానికి కూడా చేటు కలిగిస్తుందని అన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**



**ఆసిఫాబాద్ జూన్ 6 (నినాదం న్యూస్)** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని రెబ్బెన మండలం ఎడవెల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో తేమ శాతం తక్కువ ఉన్న దన్ని వెంటనే తూకం వేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని, జాప్యం చేయకూడదని తెలిపారు. వర్షాలు సమీపిస్తున్నందున ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. అనంతరం మండలంలోని కొండపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు హాజరై దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును కేటగిరి వారీగా రిజిస్టర్ లో నమోదు చేసి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు త్వరగా పరిష్కరించబడతాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సూర్యప్రకాష్, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## కొత్తూరు విద్యార్థికి నేషనల్ స్కాలర్ షిప్

**ధర్మారం జూన్ 6 (నినాదం న్యూస్) :** మండలంలోని కొత్తూరు జెడ్పిహెచ్ఎస్ లో చదివిన నిరువట్ల చేతన్ కు 2024 -25 సంవత్సరానికి గాను నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ కు ఎంపికైనట్లు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయు లు కే సత్యం తెలిపారు. ఈ స్కాలర్షిప్ రానున్న నాలుగు సంవత్సరాలు, ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు, చేతన్ కు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చేతన్ ను ఉపాధ్యాయులు గ్రామస్తులు తల్లిదండ్రులు మొదలగువారు అభినందించారు.

## అంకుశపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూములను కాపాడండి

**కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వద్లూరి కిషోర్**



**జమ్మికుంట, జూన్ 6 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో గల సర్వేనెంబర్ 570లో ప్రభుత్వ భూములను కాపాడాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వద్లూరి కిషోర్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట తహసిల్దార్ వెంకట్ రెడ్డి కి ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపా. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో టిడిపి ప్రభుత్వం అప్పటి ప్రభుత్వం నిరుపేద కుటుంబానికి చెందినటువంటి అందరికీ 180 గజాల చొప్పున ఇవ్వడం జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత గత బిఆర్ఎస్ ప్రభుత్వం అండదండలతో కొంతమంది వ్యక్తులు నాయకులు ఒక ముఠాగా ఏర్పడి ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తున్నారని అదేవిధంగా కొన్ని గుంటలలో అక్రమ కట్టడాలు కడుతున్నారని కావున జిల్లా కలెక్టర్ ప్రభుత్వ అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని లేనియెడల కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన తెలిపారు.

## గ్రామస్తుల సహాయంతో సీసీ కెమెరా ఏర్పాటు

**ఒక్క సీసీ కెమెరా పదిమందితో సమానం. జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు**

**చెన్నూర్ జూన్ 6 (నినాదం న్యూస్) :** నేను సైతం కార్యక్రమంలో భాగంగా జైపూర్ మండలంలోని టేకుమేట్ల గ్రామ స్థానిక ప్రజల సహాయం తో కలిసి పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు శుక్రవారం శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్, ఎస్ ఐ శ్రీధర్ తో కలిసి జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు 14 నిఘ నేత్రలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు తోడ్పడిన స్థానికులను అభినందించారు సీసీ కెమెరాల ఆవశ్యకతను వాటి వల్ల కలిగే ప్రయోజనాన్ని క్లుప్తంగా వివరించారు ఒక్కొక్క సీసీ కెమెరా పది మందితో సమానం అని అన్నారు సీసీ కెమెరాలు అమర్చడం ఎంత ముఖ్యమో వాటి నిర్వహణ కూడా అంతే ముఖ్యమన్నారు కెమెరాల పనితీరు అన్ని విధాలుగా గమనిస్తూ సీసీ కెమెరాల నిర్వహణ చూడాలన్నారు గ్రామస్తులందరూ నిఘ నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసిపి కోరారు.

## ఆపరేషన్ కగార్ ఆపాలి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

**కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు**



**మల్లాపూర్, జూన్ 6 (నినాదం న్యూస్) :** ఆపరేషన్ కగార్ ఆపాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బోయిని హన్మాండ్లు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్ ను తక్షణమే ఆపాలని కేంద్ర ప్రభుత్వం (నక్సలైట్లు ) మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. కోరుట్ల నియోజకవర్గం లో స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలవాలని ప్రజాస్వామ్య బద్ధం గా ప్రజల కోసం పోరాటం చేయాలని తెలిపారు. లొంగిపోయిన, అరెస్ట్ అయిన నక్సలైట్లకు అండగా ఉన్నారని తెలిపారు. 2004లో నక్సల్స్ తో చర్చల సమయంలో మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసులను చంపడం అన్యాయమని పోలీస్ లను మావోయిస్టు చంపిన తప్పే అని, మరణించిన బడుగు బలహీన వర్గాల బిడ్డలే ,మావోయిస్టులు మరణించిన అట్టడుగు వర్గాలకు చెందిన వారేనని, ఇద్దరు బీసీ ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాల వారే మరణిస్తున్నారని ఇది సరైన విధానం కాదు నక్సలైట్ సమస్యను సామాజిక ఆర్థిక దృక్పథం తో చూడాలి కోరారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ను వెంటనే నిలిపివేసి కాల్పుల విరమణ ఒప్పందం కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.

# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

శనివారం 7 జూన్ 2025



## మా దోపిడికి సహకరిస్తేనే.. లోడింగ్

- దోపిడిని ప్రశ్నిస్తే లారీలు పక్కకు
- కాంప్రమైజ్ చేస్తున్న లోకల్ లారీ యజమానులు
- సీసీ కెమెరాలు లేని చోట దోపిడీకి అడ్డా
- చోద్యం చూస్తున్న టీజీఎండిసి
- ఎలికేశ్వరం క్వారీలో దోపిడి రాజ్యం



**మహాదేవపూర్ జూన్6 (నినాదం న్యూస్):** మా దోపిడికి సహకరిస్తారా మీకు లోడింగ్ చేస్తాం లేదా ప్రశ్నిస్తే మీ లారీలు పక్కకు పెట్టిస్తాం అంటూ ఎలికేశ్వరం ఇసుక క్వారీలో ప్రశ్నిస్తున్న కొంతమంది ఇసుక లారీల డ్రైవర్లను వారి లారీలను పక్కకు పెట్టి లోకల్ లారీ యజమానులతో కాంప్రమైజ్ చేయిస్తూ ఒక్కో లారీకి 2000 రూపాయల లోడింగ్ చార్జి పేరుతో అదనపు చార్జిని వసూలు చేస్తుండటం పలువురిని విస్మయానికి గురిచేస్తుంది. లోడింగ్ చార్జి ఇచ్చిన వారికి త్వరితగతిన లోడింగ్ చేసి పంపిస్తుండటం లోడింగ్ చార్జి ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించిన వారి లారీలను ప్రక్కకు పెట్టించి సతాయించటం ఎలికేశ్వరం క్వారీలో షరా మామూలు అయిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న టీజీఎండిసి సిబ్బంది మాత్రం తమకేమీ తెలియదన్నట్లు తాము కేవలం వే బిల్లులు ఇచ్చేందుకు ఉన్నట్టు మాత్రమే వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది.

**లోకల్ లారీ యజమానుల కాంప్రమైజ్**

ఎలికేశ్వరం ఇసుక క్వారీలో ఏదైనా సమస్య వస్తే మేమున్నామంటూ కొంతమంది లోకల్ లారీ యజమానులు వారి యజమానులకు సపోర్ట్ చేస్తూ ప్రశ్నిస్తున్న లారీ డ్రైవర్లను కాంప్రమైజ్ చేస్తూ వివరిస్తుండటం గమనార్హం. ఎందుకంటే లోకల్ లారీలు సీరియల్ పాటించకుండా, ఇసుక ఎక్కువ వేసుకుని వెళ్లిన వారి యజమానులు గాని టీజీఎండిసి సిబ్బంది గాని వారికి సహకరిస్తుండటంతో మేము సైతం మీకు తోడుగా ఉంటాం అంటూ ఇసుక క్వారీ యజమానులకు సపోర్ట్ చేస్తూ వేరే లారీ యజమానులను కాంప్రమైజ్ చేస్తూ ఇసుక క్వారీలో హల్చల్ చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుండి వస్తున్న లారీ డ్రైవర్లు నోరు మూసుకొని 2000 రూపాయల లోడింగ్ చార్జి చెల్లించి లోడింగ్ చేసుకొని వెళ్తున్నారు.

**సీసీ కెమెరాలు లేని చోట దోపిడి**

ఎలికేశ్వరం ఇసుక క్వారీలో దోపిడీని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు కోటిన్నర వ్యయంతో కరెంటు లైన్లు వేయించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది సిగ్నల్ కరెక్ట్ ఉండేందుకు గోదారి ఒడ్డున టవర్ సైతం నిలిపారు. కాగా ఇంత పకడ్బందీ చర్యలు చేపట్టిన దోపిడి వ్యవస్థకు ఏదో ఒక మూల దొరకదా అన్నట్లు సీసీ కెమెరాలు కవరు చేయలేని చోట దోపిడి పర్వానికి తెర లేపుతున్నారు.

**మాట్లాడకపోయినవు అన్నా...!**

దోపిడి పర్వానికి కవరేజ్ కి వెళ్ళావా.. మాట్లాడక పోయినావు అన్నా అంటూ కొంతమంది ఇసుక క్వారీలో పని చేసే వ్యక్తులు కవరేజ్ కి వెళ్ళిన విలేకరుల వద్దకు వచ్చి కవరేజ్ చేయకుండా పలకరిస్తుండటం గమనార్హం. కవరేజ్ కి వెళ్ళిన విలేఖరి దోపిడి చేస్తున్న చోటకు వెళితే అక్కడ దోపిడిని ఆపి మరోచోటకు వెళ్లి డబ్బులు ఇవ్వకుండా వెళ్లిన లారీల వద్ద వసూళ్లకు పాల్పడుతుండటం విశేషం.



**చోద్యం చూస్తున్న టీజీఎండిసి**

ఇరిగేషన్ క్వారీలో విధులు నిర్వహిస్తున్న టీజీఎండిసి సిబ్బంది కేవలం మేము వే బిల్లులు ఇవ్వడానికే విధులు నిర్వహిస్తున్నామన్నట్లు వ్యవహరిస్తుండటం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దోపిడి పర్వంలో తమ వాటా తమకు వస్తే చాలు అన్నట్లు అంత క్వారీ యజమానులే చూసుకుంటారు అన్నట్టు ఆ శాఖ ఉన్నతాధికారుల అండదండలతోనే ఈ దోపిడి పర్వానికి తెరలేపినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

**క్వారీలు అడుగుపెట్టామా..**

ఇసుక క్వారీ లో ఎవరైనా కొత్తవారు అడుగుపెట్టారో రోడ్డు పైనున్న వ్యక్తులతో సహా లోపల ఉండిదోపిడీ చేస్తున్న వ్యక్తులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి వారి నుండి వాళ్లు బయటికి పోయే వరకు 2000 రూపాయలు ఇచ్చిన లారీలకు మాత్రమే లోడింగ్ చేసి లేదా జెసిపి ఆపరేటర్లకు ఫోన్ చేసి డబ్బులు వసూలు చేసి బయటికి పంపుతుండటం విశేషం.

## నెహ్రూనగర్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్



**నాచారం, జూన్6 (నినాదం న్యూస్) :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. భూగర్భ డ్రైనేజి సమస్య, సీసీ రోడ్ల అభివృద్ధి, స్మశాన వాటికలో అభివృద్ధి పనులు, మహిళల కొరకు మహిళ భవన్ నిర్మాణం కొరకు స్థానికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కారం చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం సతీష్, డిఈ రూపా, పి.ఆర్ ప్రవీణ్, నాగరం చంద్రశేఖర్, రామాంజనేయులు, రమణ, శ్రీనివాస్, మధన, నరేష్, సురేష్, మెండ రఘు, రాజు యాదవ్, వర్క్ ఇన్స్పెక్టర్ భిక్షపతి, జవాన్ ప్రభాకర్, సూపర్ వైజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొలిచిన వారి కొంగు బంగారం బంగారు మైసమ్మ తల్లి

- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, జూన్6 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 - సూరారం డివిజన్ సూరారం గ్రామంలోని అయ్యప్ప కాలనీలో నూతనంగా నిర్మించిన బంగారు మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన శ్రీ బంగార మైసమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, హేమలత సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, అయ్యప్ప కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా రెడ్డి, ఉపాధ్యక్షులు శివ కుమార్, కాలనీవాసులు శ్రీనివాస్ రెడ్డి, హనుమంత్ రావు, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు

- రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి : ఎంఆర్ఓ కృష్ణయ్య



**చేవెళ్ల జూన్ 06 (నినాదం న్యూస్):** భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా పొలం ఉన్న ప్రతి ఒక్క రైతుకు మేలు కలుగుతుందని ఎమ్మార్వో కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్ల, మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపల్లి గ్రామంలో తహశీల్దార్ కృష్ణయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ నేపథ్యంలో వారు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. రైతులు తమ భూమి సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి 2025 నూతన చట్టం ద్వారా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, భూమి కలిగిన ప్రతి ఒక్క రైతు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో,చేవెళ్ల సహకార సంఘం డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, మాజీ వార్డు మెంబర్ రవీందర్ గౌడ్, గ్రామస్తులు జగన్ గౌడ్,నర్సింలు, మహేందరరెడ్డి తదితరులు ఉన్నారు.

## మహిళలకు ఆర్థిక రంగాలపై అవగాహన సదస్సు



**చేవెళ్ల జూన్ 06 (నినాదం న్యూస్):** మహిళలను పరిశ్రమక వేత్తలుగా తీర్చిదిద్దాలని (ఏఎల్ ఈ ఏ పి) అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రైమి నియర్ ఆఫ్ ఇండి యా, ప్రపంచ బ్యాంకు నిధులతో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న, ఆర్ ఎ ఎంపి రైసింగ్ అండ్ ఎక్సలటరింగ్ ఎమ్మెస్సీ మీ పెర్ఫా ర్మన్స్ లో భాగంగా తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డిఆర్డిఏ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎస్సీ ఆర్‌పి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఔత్సాహిక మహిళలకు అవగాహన సదస్సు తదనంతరం పదిహేను రోజుల పరిశ్రమ నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెళుకువలు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నారు. ఆచరణీయ పరిశ్రమలకు ఉద్యమి రిజిస్ట్రేషన్ బ్యాంకుల ద్వారా ఋణ సహాయం కూడా ఇప్పించడం జరుగుతుంది.నేడు ర్యాంప్ అవగాహన సదస్సులో. చేవెళ్ల మండలం ఎంఎంఎస్ కార్యాలయం లోని శోభ ఏపీఎం, ఎస్సీ ఆర్ మల్లిక, కమ్యూనిటీ మెంబర్ అలీస్, దూహిత మేనేజర్, షబ్బీర్ ప్రభాకర్ సాగర్ నరసింహులు శ్రీనివాస్ మామయ్య యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమం..!

- జిల్లాలో 54 లక్షల మొక్కలు నాటే లక్ష్యం
- అటవీ, డీఆర్డీఓ నర్సరీల్లో మొక్కల పెంపకం
- గత ప్రభుత్వం హరితహారం... నేటి ప్రభుత్వం వనమహోత్సవం..!



**కోదాడ (నినాదం):** భారీ వర్షాలు పడగానే వన మహోత్సవ కార్యక్రమంలో భారీ ఎత్తున మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సూర్యాపేట జిల్లా 54 లక్షలకు పైగా పైగా వివిధ రకాల మొక్కల్ని నాటేందుకు వివిద ప్రభుత్వ శాఖలు సన్నద్ధమయ్యాయి. పర్యావరణ పరిరక్షణలో చెట్ల పెంపకమే కీలకమైనందున విస్తృతంగా మొక్కలు నాటడం అందరి సమిష్టి బాధ్యత.అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వన మహోత్సవ కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టాలని బావిస్తుంది. గ్రామీణాభి వృద్ధి సంస్థ, ఆటవీ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీల్లో సరిపడ మొక్కల్ని పెంచారు. భారీ వర్షాలు పడగానే మొక్కల్ని పంపిణీ చేసేందు కు ఏర్పాట్లు చేశారు. ఖాళీ స్థలాల్లో మొక్కల్ని నాటేందుకు ఆయా జిల్లాలు, మండలాల వారిగా ప్రణాళికలు రూపొందించారు.

**గత ప్రభుత్వం హరితహారం.. నేటి ప్రభుత్వం వనమహోత్సవం...!**

గత ప్రభుత్వం హరిత హారం పేరిట భారీ ఎత్తున మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటుతోంది. సూర్యాపేట జిల్లాలో అటవీ విస్తీర్ణం ఉన్నప్పటికీ విస్తరిస్తున్న పారిశ్రామిక ప్రాంతం కావడంతో చెట్ల పెంపకం ఎంతో అవసరముంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో పాటు, హుజూర్నగర్ నియోజకవర్గమంతా పరిశ్రమలతో నిండిపోయింది. మరో పక్క భారీ ఎత్తున బహుళ అంతస్తుల భవనాలు విస్తరిస్తున్నాయి. వాతావరణమంతా కాలుష్యమయంగా మారింది. వివిధ రకాల పరిశ్రమలు, రైస్ మిల్లులు, కంకర మిల్లులున్నాయి. దీంతో పారిశ్రామిక వ్యర్థాలతో వాతావరణ కాలుష్యమేర్పడుతుందని పర్యావేరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విస్తారంగా మొక్కలు నాటడం ద్వారా చెట్లను పెంచాలి. ఆక్సిజన్ ను ఇచ్చే మొక్కలతో పాటు పండ్లు, ఇతర ఆహార పదార్థాలు లభించే రకాలకు చెందిన చెట్లను. మీ పెంచేందుకు మొక్కల్ని సిద్ధం చేశారు. పలు ప్రాంతాల్లో ఈత మొక్కల్ని కూడా నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

**54 లక్షల మొక్కలు నాటే లక్ష్యం..**

వన మహోత్సవాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నందాల్ పవార్ సూచించారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్లో డీఎఫ్ఎ సతీష్ కుమార్ కన్వీనర్గా నిర్వహించిన వన మహోత్సవం, అటవీ రక్షణ కమిటీ సమావేశంలో ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ రాంబాబులతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీరాజ్, డీఆర్డీఏ కలిసి 50.4 లక్షలు, అటవీ శాఖ 2.3 లక్షలు, మున్సిపాలిటీలు 1.3 లక్షల మొక్కలు మొత్తం 54 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారని తెలిపారు. వర్షాకాలం మొదలైనందున జూన్ 10 లోపే మొక్కలు పెద్ద ఎత్తున నాటాలన్నారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు అటవీ క్షేత్రస్థాయి పర్యటన, సర్వే, భూ సేకరణతో పాటు పంచానామా సమయంలో పోలీస్ శాఖకు సమాచారం అందిస్తే బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు

**నర్సరీల్లో మొక్కల పెంపకం**

వన మహోత్సవ కార్యక్రమం కింద విస్తృతంగా మొక్కల్నినాటేందుకు కావాల్సిన మొక్కల్ని నర్సరీల్లో పెంచుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వనాల పేరిట నర్సరీలున్నాయి. వీటిల్లో వివిద రకాల మొక్కల్ని పెంచారు. ఆటవీ శాఖ. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉన్న నర్సరీల్లో మొక్కలు పెంచారు.వివిద రకాల మొక్కల్ని నర్సరీల్లో పెంచుతున్నారు. ఆయా ప్రాంతాలకు మొక్కల్ని పంపిణీ చేసేందుకు వీలుగా ఉండేట్లు నర్సరీలున్నాయి. భారీ వర్షాలు కురియగానే నర్సరీల నుండి మొక్కల్ని ఆయా ప్రాంతాలకు రవాణా చేస్తారు. ఏప్రిల్, మే నెలల్లో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రతలు తీసుకున్నారు. ఇటీవల 'కురిసన వర్షాలతో నర్సరీల్లోని మొక్కలు మరింత 'పచ్చ బడ్డాయి. భారీ వర్షాలు పడగానే గుంతలు తవ్వి "మొక్కల్ని నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

**మొక్కల సంరక్షణకు ప్రణాళికలేవి..?**

గత ప్రభుత్వం హరిత హారం, ఈ ప్రభుత్వం వన మహోత్సవం పేరిట కోట్ల సంఖ్య మొక్కలు నాటుతున్నారు. నాటిన ప్రతి మొక్క బతికి చెట్టుగా పెరిగేందుకు అవసరమైన సంరక్షణ చర్యలు తీసుకోవడంలో మాత్రం ప్రణాళికల్లేవనే చెప్పాలి. కార్యక్రమంలో భారీ ఎత్తున విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, పర్యావరణ వేత్తలు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యమవుతున్నారు. అదే పద్ధతిలో నాటిన మొక్కలన్నీ బతికి పెద్దవయ్యేందుకు చుట్టు కంచె ఏర్పాటు చేయడం, నీటి ఎద్దడి తలెత్తినప్పుడు నీటిని అందించడంలో విఫలమవుతున్నారు. చాలా ప్రాంతాల్లో జులై, ఆగస్టులో నాటిన మొక్కలు ఎండా కాలం వచ్చే సరికి సగానికి పైగా ఎండిపోతున్నాయి. కనీసం 80 శాతం మొక్కలైనా బతికేలా చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. మొక్కల్ని రక్షించేందుకు ఉపాధి హామీ కూలీల ద్వారా సంరక్షణ చర్యలు చేపడుతున్నప్పటికీ పర్యవేక్షణ సరిగ్గా ఉండట్లేదు. స్థానిక స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేస్తే మంచి ఫలితాలొస్తాయంటున్నారు.

## మావోయిస్టులపై కేంద్రం కాల్పులు విరమించాలి

- శాంతి చర్చలు జరపాలని
- వామపక్ష, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



**మేడ్చల్ మల్కాజిగిరి, జూన్06(నినాదం న్యూస్):** జూన్ 14, హైదరాబాద్, ఇందిరాపార్కు వద్ద జరగబోయే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అఖిల పక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 2025, జూన్-6, శుక్రవారం రోజు, కాప్రా, ఇసియల్ లోని సిపిఐ కార్యాలయంలో ఉమామహేశ్వర్ సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలోసి కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి,సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు అనురాధ, ఐ.ఎఫ్.టీ.యు. శివ బాబు, సిపిఎం జిల్లా సెక్రటరీ సత్యం, రవి, శంకర్, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ వి.ప్రవీణ్ కుమార్, పిడిఎం చంద్రమౌళి, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, ఇఫ్టూ షేక్ షావలి, బిఎల్ఎఫ్, బి ఎన్ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామెర్ల ఐలయ్య, తదితర సంఘాలు, పార్టీలకు చెందిన నేతలు హాజరై ప్రసంగించారు. ఆదివాసిల హననం చేసే ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. గత 17 నెలలుగా జరిగిన కగార్(అంతిమ యుద్ధం) పేరు మీద సుమారు 550 మందిని పొట్టనపెట్టుకున్నారని ఆరోపించారు. ఈదేశ ప్రజలపై పరాయి శత్రు దేశాలపై చేసిన దాడులలో ఎలాగైతే అదునా తన మైన యుద్ధ మందుగుండు సామాగ్రిలతో డ్రోన్లు, యుద్ధ టాంకర్లు, హెలికాప్టర్లు, లక్షలాది మంది భద్రతా బలగాలతో దాడులు చేస్తున్నారో, అదే తరహాలో ఆదివాసులపై, వారికి అండగా నిలిచిన మావోస్టులపై కొనసాగించ డాన్ని తీవ్రంగా ఖండించారు. వారిని వెంటాడి, వేటాడి హతమార్చడం భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరద్ధమని, ఇలాగండి చర్యలు ఈదేశ ప్రజల జీవించే హక్కును కాలరాయడమేనని ఎండగట్టారు. ఆదానీ, అంబానీ లాంటి బడా కార్పొరేట్ లాంటి సంస్థలకు అటవీ సంపదలు, సహజవనరుల దోపిడీకి ఎర్రతివాచీ పరిచాయాని ఆగ్రహించారు. బుద్దిజీవులు, మేదావులు కగార్ దుర్మార్గం గురించి మాట్లాడాల్సిన అవసరాన్ని, సంఘటితంగా కలిసి ఉద్యమించక పోతే భవిష్యత్తులో ఆపరేషన్ కగార్ తర్వాత అర్బన్ నక్సలైట్ల ముద్రవేసీ, ప్రశ్నించేవారిని, పోరాడేవారని, రాజ్యాంగ బద్ధ హక్కుల కొరకు ఉద్యమించేవారిని బీజేపీ జరిపే అమానవీయ హత్యాకాండకు బలికావల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఆపాలని హక్కుల నేతలు, పౌర ప్రజాస్వామికవాదులు డిమాండ్ చేస్తూ జరిగిన ఆందోళనలను గురించి తెలియజేశారు. అందులో బాగంగా ఈ నెల 14 న హైదరాబాద్ ఇందిరాపార్కులో మహాదర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని తీర్మానించారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో 14 వ తేదీన ఆపరేషన్ కగార్ ను ఎత్తివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి .దామోదర్ రెడ్డి, శంకర్రావు, తోటపల్లి శంకర్, గద్దర్ అభిమాన సంఘాల అధ్యక్షులు సీఎల్. యాదగిరి, ఏ ఐ వై ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్మిక సభ్యులు కోమటి రవి, జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ చెరువుల అభివృద్ధి కోసం సీఎం అధికారుల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్



**మేడ్చల్ మల్కాజిగిరి,జూన్06,(నినాదం న్యూస్):** అభివృద్ధి పనుల పురోగతి సాదించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని రామన్నకుంట చెరువు తిరుమలగిరి చెరువుల అభివృద్ధికి సంబంధించి కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో బోర్డు, హెచ్ఎండిఏ అధికారులతో ఎమ్మెల్యే సమన్వయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని రామన్నకుంట తిరుమల గిరి చెరువును అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని హెచ్ఎండిఏ అధికారులు ఇప్పటికే చెరువులను పరిశీలించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ చెరువుల అభివృద్ధి కోసం ప్రాజెక్ట్ రిపోర్ట్ లు కూడా సిద్దం అయ్యాయని టెండర్లు కూడా పిలవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్దం చేసిందని కాని అందుకోసం బోర్డు నుంచి ఎన్వోసి కావల్సి ఉంది అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగ కంటోన్మెంట్ నియోజకవర్గం మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ నిధులు కేటియిస్తూ, అధికారులకు ఆదేశాలిస్తూ అభివృద్ధికి సహకరిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆయనకు కృతజ్ఞతలు తెలియచేశారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పిద్దాం



**మల్లాపూర్, జూన్ 06 (నినాదం న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా మల్లాపూర్ మండలం లోని కొత్త దాంరాజ్ పల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బంగారు భవిష్యత్తును ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, జరుపుల సుధాకర్ శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మౌలిక సదుపాయాలు. త్రాగునీరు, మూత్రశాలలు, విద్యుత్, ఫ్యాన్స్ డిజిటల్ తరగతులు, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య, ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే లభిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు తమ పిల్లల్ని చేర్పిస్తే ఆర్థికంగా కుటుంబము ఎదిగే అవకాశాలు చాలా ఉన్నాయని తల్లిదండ్రులు పిల్లలపై మమకారంతో మంచి చదువు అందించలే ఉద్దేశంతో ఎలాంటి అర్హతలు లేని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి వాళ్ల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని అన్నారు. నూతన విద్య సంవత్సరంలో విద్యార్థులను అధిక సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరుతూ గ్రామస్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు రాజయ్య, పరమే శ్వర్, విజయ, ప్రజ్ఞ, అంగన్వాడీ టీచర్ గంగామణి, గ్రామ కార్యదర్శి వంశీధర్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.